



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 30 ఆగస్టు 2025 పేజీలు 8


# ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం



## మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతమైనందుకు శుక్రవారం ఉదయం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర మంత్రి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం మంత్రి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడబిడ్డల్లో చైతన్యం తెచ్చి, మహిళలకు పద్మావతి విశ్వవిద్యాలయం నెలకొల్పి, రిజర్వేషన్లు, ఆస్తి హక్కును కల్పించిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి అన్న నందమూరి తారక రామారావుకే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలను మరింత ముందుకు తీసుకు పోయిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుందన్నారు. డ్వాక్రా సంఘాలను పెట్టడం, సాఫ్ట్వేర్ రంగంలో మహిళలకు ప్రోత్సహించి విదేశాలకు పంపడం, ఆడబిడ్డలు ఇబ్బంది పడకుండా మిగతా 2లో

## మెగా డీఎస్సీతో యువత కలలను నెరవేర్చిన కూటమి

- గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ అంటూ యువతను మభ్యపెట్టింది
- రాజధాని అమరావతిపై కూడా వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

వివరాలు 6లో

## పల్లె ప్రగతితోనే వికసిత్ భారత్




- స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టిగా కృషిచేద్దాం
- పీఏఐ 2.0తో పంచాయతీల అభివృద్ధిపై నిరంతర పర్యవేక్షణ
- కొత్త సూచీలో తొమ్మిది ఇతివృత్తాలు, 147 సూచికలు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2

## చెరువును తలపిస్తున్న నేషనల్ హైవే రోడ్డు

### వార్తకు స్పందించి వెంటనే చేపట్టిన రోడ్డు మరమ్మత్తులు

సూర్య ఎఫెక్ట్

**నందిగామ, మేజర్ న్యూస్:** గురువారం నేటి దినపత్రిక సూర్యలో శుక్రవారం ప్రచురత మైన చెరువును తలపిస్తున్న నేషనల్ హైవే రోడ్డు వార్తకు అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు వెంటనే చేపించారు. పట్టణ శివారు అంబారు పేట క్రాస్ రోడ్డు వద్ద నేషనల్ హైవే ఫ్లై ఓవర్ పక్కన హైవే రోడ్డు రెండు అడుగుల గుంటల మయంతో చెరువును తలపిస్తుంది. గత 6 సం.లుగా హైవే ఫ్లైఓ వర్ పనులు నత్త నడక నడుస్తున్నాయి. ప్రజా సమస్యను హైవే సిబ్బంది తక్షణమే స్పందించి శుక్రవారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ సంద ర్భంగా నందిగామ పరిసర ప్రాంత ప్రజలు సమస్యల పరిష్కారం కృషి చేసిన నేటి దినపత్రిక సూర్యకు, హైవే సిబ్బందికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.




# ట్రాక్టర్లతో ర్యాలీతో కదం తొక్కిన కర్షకులు

- రైతుల ఐక్యతకు, కూటమి ప్రభుత్వానికి ప్రతీక ట్రాక్టర్ల ర్యాలీ
- రైతే రాజు...రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది
- అన్నదాతలకు పెట్టుబడి సాయం రూ.20.19 కోట్లు
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం వర్తింపుకు కృతజ్ఞతగా గొల్లపూడిలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

వివరాలు 2లో...

# చెత్తాచెదారానికి కేరాఫ్‌గా కంచికచర్ల

- అధ్వానంగా పారిశుధ్యం అంటు రోగాలు ప్రబలతాయని ప్రజల ఆందోళన

2లో






## చెత్తాచెదారానికి కేరాఫ్ అడ్రస్ కంచికచర్ల

**కంచికచర్ల ఆగస్టు 29 మేజర్ న్యూస్ :** 30 వేల జనాభా కలిగిన మేజర్ పంచాయతీ అయిన మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసి పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది.ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వ కారణం కంపుకొట్టే చెత్త తప్ప అనే వాదనలు వినిపిస్తున్నాయి.వీధుల వెంట చెత్త కుప్పలు,ప్రజలను వెక్కిరిస్తున్నాయి. చెత్తాచెదారానికి కేరాఫ్ అడ్రస్ గా కంచికచర్ల మారిందని పలు విమర్శలు వస్తున్నాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకి చెత్త కుప్పలు తోడవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తుంది.మురుగు నీటి కాలువల పారుదల లేక మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదగలుగు తుంది. ప్రధానంగా గొట్టుముక్కల రోడ్డు లో చెత్తకుప్పలు అమితంగా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు, ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు ఆయా ప్రాంతాలను శుభ్రం చేయటం తప్ప మిగిలిన రోజుల్లో పంచాయతీ వారు పారిశుధ్యం పై మురుగు కాలవల పారుదలపై ఏమాత్రం దృష్టి సారించట్లేదని విమర్శలు వస్తున్నాయి.స్థానికంగా ఉన్న అన్ని కాలనీలలో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా తయారయ్యాయి. దశాబ్దాలు గడుస్తున్న స్థానికంగా మంచినీటి సమస్య మురుగు కాలువల సమస్య తీరేటట్లు కనిపించట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.డివిఆర్ కాలనీ, ఇందిరా కాలనీ, ప్రణీత కాలనీ, వసంత కాలనీ, అం బేద్కర్ కాలనీ, అరుంధతి కాలనీ ఇలా చెప్పుకుంటూ పోతే కంచికచర్ల పూర్తిస్థాయిలో పారిశుధ్య పనుల్లో వెనకబడి ఉన్నది అనుటలో అతిశయోక్తి లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు ఉన్నారా లేదా అనే అనుమానం పలువురు వ్యక్తం చేస్తున్నారు.ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి మురు గు అక్కడే వర్షాలు పడుతున్నందున ప్రజలు ఇళ్లలో నుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా తీవ్ర దుర్వాసన వస్తుంది.అంటు రోగాలు వ్యాపించే ప్రమా దం పొంచి ఉందని ఆయన కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నామ మాత్రమే గానీ ఆచరణలో సాధ్యపడటం లేదని తేటతెల్లమవుతుంది.ఉన్నతాధికారులు పారిశుధ్యం,మురుగు కాలువల పై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు ముక్తకంఠం తో కోరుతున్నారు.

## ట్రాక్టర్లతో ర్యాలీతో కదం తొక్కిన కర్షకులు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రైతే రాజు...రైతు లేనిదే రాజ్యం లేదు...రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది. దీన్ని ఆచరిస్తూ కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు పెట్టుబడి సాయంగా రూ.7 వేలు తొలి విడతగా అందజేసింది. దీనికి కృతజ్ఞతగా నేడు గొల్లపూడిలో రైతు సోదరులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించడం శుభపరిణామం." అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.పీఎం కిసాన్-అన్నదాత 'సుఖీభవ' పథకం వర్తింపుకు కృతజ్ఞతగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో శాసనసభ్యుని వారి కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రైతు సోదరులు శుక్రవారం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనే స్వయంగా ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపరిచారు. రైతన్నల ఆనందోత్సాహాల ట్రాక్టర్ల ర్యాలీతో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఐక్యతకు, కూటమి ప్రభుత్వానికి మద్దతుకు ప్రతీక ఈ ట్రాక్టర్ల ర్యాలీ అని పేర్కొన్నారుమైలవరం నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది అన్నదాతలకు రూ.20.19 కోట్ల రూపాయలు 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ కింద మైలవరం నియోజకవర్గంలో రూ.15.12 కోట్లు రైతుల ఖాతాలో జమ, దాదాపు 30,241 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ యోజన కింద మైలవరం నియోజకవర్గంలో రూ.5.07 కోట్లు రైతుల ఖాతాలో జమ, దాదాపు 25,336 మంది రైతులకు లబ్ధి కలిగిందన్నారు.అన్నదాత సుఖీభవ ఈ పథకం ద్వారా అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందించనున్నారని వెల్లడించారు.మొదటి విడతగా రూ.5,000లు ఒక్కో రైతు ఖాతాలో రూ.7,000 జమ అయ్యాయి. దీనివల్ల రాష్ట్రంలో 46.86 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరింది. రైతు సోదరుల తరపున ప్రధాని మోడీకి, సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వున్నా సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి నేతలు, మైలవరం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

దీపం పథకం కింద సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ ల సరఫరా, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామ న్నారు., తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 68 లక్షల మంది మహిళలు లబ్ది పొందుతున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద రాష్ట్రంలో ఉన్న బస్సులలో 74% బస్సులను కేటాయించారని, చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు 1500 నుంచి 2000 రూపాయల నెలవారీ ఖర్చులు ఆదా కావాలని, ఆ డబ్బులు వేరే విధంగా ఉపయోగించుకోవాలని, డ్వాక్రా సంఘాల ద్వారా వచ్చిన డబ్బుతో ఎం ఎస్ ఎం ఈ చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు.సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం పట్ల మహిళల్లో అద్భుతమైన స్పందన ఉందన్నారు.రాబోయే రోజుల్లో మహిళలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టబోతోందని వాటన్నిటిని మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు..యోగాంధ్ర కార్యక్రమంతో ప్రపంచ రికార్డు సృష్టించామని ప్రతి ఒక్క ఇంటిలో అందరూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ ఆశయమన్నారుగతంలో మచిలీపట్నం విజయవాడకు 4 వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కృషి చేశామ న్నారు. అలాగే నేడు మచిలీపట్నం విజయవాడకు 6 వరుసల జాతీయ రహదారి నిర్మించేందుకు కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితో మాట్లాడామని, 2600 కోట్ల రూపాయల వ్యయంతో ఆ రహదారి మంజూరు చేయడం జరిగిందన్నారు.మచిలీపట్నం నుండి రేపల్లె వరకు 45 కిలోమీటర్ల రైల్వే లైన్ పొడిగింపు కార్యరూపం దాల్చిందని, ఇందుకోసం 3 నెలల క్రితం కేంద్ర మంత్రితో మాట్లాడామని అన్ని ప్రయత్నాలు చేశామని 2 సంవత్సరాలలో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ రైల్వే లైన్ కోసం పోరాటం చేసిన బందరు నివాసి కొక్కిలిగడ్డ కోదండరామయ్య నేడు చనిపోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తి పథకంవిజయవంతం అయిందన్నారురాష్ట్రంలో 10,500 బస్సులు ఉండగా అందులో 75% 8,500 బస్సులను మహిళల కోసం ఉచిత బస్సు పథకానికి కేటాయించామన్నారుతాము అనుకున్న అంచనాలు మించిపోయాయని, రోజుకు ఆర్టీసీకి 5 కోట్ల రూపాయల నష్టం వస్తుందని అంచనా వేశామని, అయితే 7.5 కోట్ల రూపాయల నష్టం వస్తుందన్నారు. ఇప్పటివరకు 2 కోట్ల 40 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. గతంలో బస్సులలో మహిళలు పెద్దగా లేకుండా వెలవెలబోయే వన్నారు. ప్రయాణించేది తక్కువగా ఉండేదని నేడు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తుండడంతో మహిళలు అధికంగా ప్రయాణం చేస్తున్నారన్నారుప్రస్తుతం ఉన్న బస్సులు చాలక పోవడంతో మరో 1,380 కొత్త బస్సులను సరఫరా చేయాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారుదశలవారీగా బస్సులు పెంచే ఏర్పాటు చేస్తామన్నారు.బస్సుల కొరత లేకుండా చూస్తామన్నారు.ఈ సందర్భంగా బందరువాసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు జీ ధనలక్ష్మిని మంత్రి , ఆర్టీసీ చైర్మన్ ఘనంగా శాలువతో ఘనంగా సత్కరించారు.తదనంతరం మహిళా లబ్ధిదారులకు మంత్రివర్యులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మహిళలతో కలిసి మంత్రివర్యులు, ఆర్టీసీ చైర్మన్ గ్రూప్ ఫోటో దిగారు.తదుపరి మంత్రివర్యులు మహిళలకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఆర్టిసి ఆర్ఎం వెంకటేశ్వర్లు, డిఎం పెద్దిరాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు అనిత, సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు గొర్రెపాటి గోపీచంద్, రొండి కృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ కాశీ విశ్వనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ గోపు సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, స్థానిక నాయకులు ఫణి కుమార్ పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అక్రమంగా యూరియాను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** అక్రమంగా ఎవరికి తెలియకుండా ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు యూరియాను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భరోతుపీక్లా నాయక్, టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమా నాయక్, పిఎసిఎస్ అధ్యక్షులు బెజవాడ శంకర్ ఆరోపించారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి మండల వ్యవసాయ శాఖ అధికారి చెడ్డ పేరు వచ్చే విధంగా చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందాల్సిన యూరియాను ప్రవేట్ ఎరువుల దుకాణాలకు దొడ్డిదారిన పంపిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 8,9,10 వ తేదీలలో మార్క్ ఫెడ్ ఏ కొండూరు చీమలపాడు రైతు సేవ కేంద్రాలకు వచ్చిన యూరియాను ప్రైవేటు ఎరువుల దుకాణాలకు తరలించి రైతులకు మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో రైతులకు అన్నదాత సుఖీభవ లాంటి విన్నతమైన పథకాలు తో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి పై చర్యలు తీసుకోవాలన్నారు. అసలు యూరియాను ప్రైవేట్ ఎరువుల దుకాణాలు కు అప్పు చెప్పడం పై ఈ వ్యవసాయ శాఖ అధికారి తీరును తప్పు పట్టారు. యూరియా పై ఇదే అధికారి కి స్థానిక నేతలు మైన మేము సంప్రదిస్తే యూరియా మన మండలానికి రాలేదు అని చెప్పిన ఈ



అధికారి ప్రైవేట్ ఎరువులు దుకాణాలకు యూరియా ఎందుకు పంపించారని ప్రశ్నించారు. ఇలా చేయడం వల్లఎవరికి చెడ్డ పేరు వస్తుంది అని అటు రాష్ట్ర ప్రభుత్వానికి స్థానికంగా ఉన్న నాయకులకు చెడ్డ పేరు వచ్చే విధంగా వ్యవహరిస్తున్న ఈ వ్యవసాయ శాఖ అధికారి పై ఉన్నతాధికారులు విచారణ జరపాలన్నారు. రైతులు యూరియా కోసం అధికారులు చుట్టూ ప్రదక్షణాలు చేస్తూ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి తన దైన శైలిలో యూరియా ను పక్కదారి పట్టించడమే కాకుండా యూరియా అసలు రాలేదు అని రైతులకు అబద్ధాలు చెప్పి తనస్వారు సారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ వ్యవసాయ శాఖ అధికారిపై తక్షణమే ఉన్నత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ను విజ్ఞప్తి చేశారు.

# పల్లె ప్రగతితోనే వికసిత్ భారత్..

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. గ్రామాల సుస్థిర అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని బలంగా నమ్మిన మహాత్ముని ఆశయాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమంతో పాటు ఎన్నో అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తున్నాయని, వీటి ఆసరాతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పంచాయతీ అభివృద్ధి సూచిక (పీఏఐ) 2.0పై శుక్రవారం ఎంజీ రోడ్డులోని పంచాయతీరాజ్ శాఖ సమావేశ మందిరంలో కార్యశాల జరిగింది. జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు తది తరులు హాజరైన ఈ వర్క్‌షాప్‌నకు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. మహాత్మాగాంధీ, డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలతో పాటు ఆధునిక తెలుగు భాష వైతాళికుల్లో ఒకరైన గిడుగు వేంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఐరాస సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధన లో భాగంగా గ్రామ పంచాయతీల సంస్థాగత సామర్థ్యాలను పెంచేందుకు, ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ పీఏఐ 1.0ను రూపొందించిందని.. ఇప్పుడు దీన్ని ఆధునీకరించి పీఏఐ 2.0గా మార్చడం జరిగిందన్నారు. ఈ సూచీ కింద పేదరికం లేని, మెరుగైన జీవనోపాధులు కలిగిన పంచాయతీటీ ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, బాలిక స్నేహపూర్వక గ్రామ పంచాయతీ, నీరు సమృద్ధిగల గ్రామ పంచాయతీ, పచ్చదనం, పరిశుభ్రత కలిగిన గ్రామ పంచాయతీ, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామ పంచాయతీ, సామాజిక న్యాయం-సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీ, సుపరిపాలన కలిగిన గ్రామ పంచాయతీ, మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ అనే తొమ్మిది ఇతివృత్తాల్లో 147 సూచికలు ఉన్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీల్లో ప్రగతిని అంచనా వేసేందుకు, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించేందుకు, కొత్త విధానాలు, ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సూచీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమష్టి భాగస్వామ్యంతో సూచికల్లో ప్రగతి సాధనకు కృషిచేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. చేసిన కృషికి జాతీయ స్థాయి పురస్కారాల ద్వారా ప్రత్యేక గుర్తింపు కూడా లభిస్తుందని.. ఇందుకు ముప్పాళ్ల గ్రామమే ఉదాహరణ అని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ - పది సోపానాలు, కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)లను పీఏఐ 2.0తో అనుసంధానిస్తూ పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈవో కె.కన్నమ నాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ డీఎల్‌డీవో ఎస్.నిర్మల జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తేటతెలుగు మనకు వరం - తెలుగే మన మూలధనం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 29 :** జిల్లా పరిషత్ హై స్కూల్, పెంజెంద్రలో ఆగస్ట్ 29 శుక్రవారం మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుతల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. మహాలక్ష్మి మాట్లాడుతూ పిల్లలందరికీ, ఉపాధ్యాయ బృందానికి తెలుగు భాషా దినోత్సవ, క్రీడా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ, తేట తెలుగు మనకు వరం, తెలుగే మన మూలధనం, తెలుగు భాష మనకు శ్వాస, తెలుగు మాట మణిపూస, తెలుగు వెలుగు మనకు రక్ష, అమృత భాష మన తెలుగు అని కొనియాడారు. పిల్లలందరూ మాతృభాష మీద మమకారం పెంచుకొని మిగతా భాషలో కూడా ప్రావీణ్యం సంపాదించాలని తెలిపారు. మాతృభాష దినోత్సవ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు ఎన్ వాసవి వ్యాఖ్యాతగా వ్యవహరించి పిల్లలతో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిపించారు. క్రీడా దినోత్సవ సందర్భంగా కేఎల్ శ్రీనాథ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పాఠశాలలో పిల్లలకి రన్నింగ్, షాట్ పుట్, వాలీబాల్, కోకో, గన్ని బ్యాగ్ రేస్, ఫ్రాగ్ రేస్ తదితర ఆటల-పోటీలు నిర్వహించి ఉపాధ్యాయులచే బహుమతులు అందజేసినారు. క్రీడా దినోత్సవం హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జరుపుకుంటామని, పిల్లలు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకుని సామాజిక నైపుణ్యాలు అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. నాగబాబు, నాంచారమ్మ, రత్నకుమారి, రాంబాబు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పామర్రు మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పామర్రులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని రక్త పరీక్ష కేంద్రం, మహిళా వార్డు, మందుల విభాగం సందర్శించి వైద్యులతో మాట్లాడారు. శుక్రవారం చేసిన రక్త పరీక్షల్లో మూడు కేసులు టైఫాయిడ్‌గా గుర్తించామని వైద్య సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. వర్షాకాలంలో నీటి కలుషితం కారణంగా టైఫాయిడ్, ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొంటూ అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. ఈ క్రమంలో ఆయన వైద్యం కోసం అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీయగా, బాగానే వైద్యం చేస్తున్నారని వారు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుదేశ్‌బాబు, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

## గుర్రాల్లంక గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న బాబురావు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం వీరంకిలాకు గుర్రాల్లంక సెంటర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబురావు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ యూత్ సభ్యులను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాబురావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన...




**జగ్గయ్యపేట, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాది టి.విజయకుమార్ పై పోలీసుల అక్రమ చర్యలను నిరసిస్తూ, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు, దాసరినాగేశ్వరావు, గొనెల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస గౌడ్, ఎమ్..ఆంజనేయులు, మన్నెం మురళి,పూల నాగరాజు, రావూరి ప్రసాద్, ఎమ్.మనోహర్, గురువులు రాజు, అశోక్, నరేష్, పల్లపు రవి,భిక్షమయ్య, జోత్స, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేసిన కవులు అభినందనీయులు



**పెనుగంచిప్రోలు, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** తెలుగు భాష అభివృద్ధి కోసం పలువురు మహాకవులు రచయితలు చేసిన సేవలు అభినందనీయమని స్వామి పుల్లయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబురావు అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పాఠశా లలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించడమే కాక క్రీడల దినోత్సవం సంద ర్భంగా ర్యాలీ నిర్వహించారు. పిల్లలతో ప్లేకార్డులపై నినాదాలు రాయించి, గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. చదువులో, వక్తృత్వ,వ్యాసరచన పోటీలలో, ఆటలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేగినేటి వెంకటరమణ, రాఘవ, నల్లూరి పద్మ, పాకలపాటి ఉష, ఎం స్వాతి శిల్ప, స్వాతి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## మహాకవి గురజాడ చిరస్మరణీయుడు

**పెనుగంచిప్రోలు, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** మహాకవి గురజాడ అప్పారావు సహకారంతో తెలుగు భాషను అందరికీ అందుబాటులోకి తెచ్చిన గిడుగు రామ్మూర్తి సేవలు అజరామరమని కాకాని వెంకటరత్నం బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కొక్కిలిగడ్డ జలజ అన్నారు. శుక్రవారం నాడు ఆమె ఆధ్వర్యంలో పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం,జాతీయ క్రీడల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ క్రీడ హాకీకి చేసిన సేవలను స్మరించుకున్నారు. పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా వ్యాయామ ఉపాధ్యాయులు లేనప్పటికీ ప్రధానోపాధ్యాయురాలికి పూర్తిగా సహకరించి ఆటల పోటీలు నిర్వహణ, డ్రిల్ బాధ్యతలు చూస్తున్న హిందీ ఉపాధ్యాయుడు నాగరాజును పలువురు అభినందించారు. క్రీడల్లో, ప్రతిభా పాటవ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జూపూడి ప్రభుదాస్, దైదా దానయ్య, బాణావతు రాము నాయక్, వేకనూరి నాగరాజు,ముక్కా సత్యనారాయణ, సుబ్బారావు, మోహనరావు, లీల, భారతి, కరుణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు.



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు కుమారుడుగా, తెలుగుదేశం పార్టీ చైతన్య రథసారథిగా, సినీ ప్రపంచంలో కళాకారుడిగా ఎనలేని సేవలు అందించిన నందమూరి హరికృష్ణని స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారుఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శామ్‌సంగ్ నుంచి మొబైల్ సిటీ టెక్నాలజీస్ పోర్ట్‌ఫోలియో




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, తన అనుబంధ సంస్థ శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కో. లిమిటెడ్ ద్వారా, న్యూరోలాజికా సహకారంతో, భారతదేశంలో తదుపరి తరం మొబైల్ సిటి ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కో. లిమిటెడ్, ఆధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలలో ప్రపంచ నాయకుడిగా, డయాగ్నొస్టిక్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీని మార్చడానికి ప్రత్యేకంగా రూపొందించిన ఈ తదుపరి తరం వ్యవస్థలను అందిస్తుంది. ఇవి మొబిలిటీ, ఏఐ-సహాయక సామర్థ్యం, రోగి-మొదటి రూపకల్పనను మిళితం చేస్తూ, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు ఎప్పుడైనా, ఎక్కడైనా నాణ్యమైన సేవను అందించడానికి సాధికారత కల్పిస్తాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి శ్రేణి పరికరాలు ఆసుపత్రులు, ప్రత్యేక కేంద్రాల వివిధ క్లినికల్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. అన్ని ఆసుపత్రుల్లో, ప్రత్యేకంగా సేవలు తక్కువగా లభించే ప్రాంతాల్లోనూ, ఈ వ్యవస్థల ఉపయోగాన్ని సాధ్యం చేయడంతో, భారత్‌లో ఆధునిక ఇమేజింగ్ సేవలకు సమాన అవకాశం కల్పించడానికి శామ్‌సంగ్ ముందడుగు వేస్తోంది.

## టీడీపీ కార్యాలయంలో హరికృష్ణ వర్ధంతి వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్ :** నియోజక వర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్ర వారం మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య, పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చాట్ల రమేష్, దాలిపర్తి ప్రసాద రావు, పానుగంటి సందీప్, రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

## చాగంటిపాడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామములో తెలుగు దేశం పార్టీ నాయకులు అధికారులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత నాయకుడు మట్టా అమృతబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్ ల సూచనల మేరకు ఇంటింటికి తాము కూడా తిరిగి రేషన్ కార్డులను అంది స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి బాలకోటయ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గుడ్లవల్లేరు గ్రామం ప్రధాన సెంటరులోని విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద గౌడ సంఘం వినాయక చవితి ఉత్సవాల 3వరోజు శుక్రవారం పూజా కార్యక్రమంలో గుడ్లవల్లేరు తెలుగు దేశం పార్టీ నాయకులు, యువ బిసినేత మురాల నరేష్, అరుణ దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారి ప్రసాదం భక్తులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో యువనేత కాసాని శ్రీరామ్ పాల్గొన్నారు.

**కౌతరం సీతపేటలో..** శ్రీ వర సిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో 3 వ రోజు పూజ కార్యక్రమంలో శ్రీకొండలమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ బాడిగ భాస్కరరావు దంపతులు పాల్గొని ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేసారు. కార్యక్రమంలో సమ్మెట నాగేశ్వరరావు, తూము సూర్య నారాయణ భక్తులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో క్రీడా దినోత్సవ వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు మండలం నల్లగుంట లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుక లను శుక్రవారం జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక వికాసానికి, శరీర దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి అవకా శం కలుగుతుందన్నారు. కావున ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్రంశెట్టి దేవి రమణి, జనసేన పార్టీ మండల కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి వీరాస్వామి, గురుకుల పాఠశాల ప్రిన్సి పల్ మేదర రమేష్ బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జుజ్జువరంలో పల్లెనిద్ర చేసిన పోలీసులు



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలో ని జుజ్జువరం గ్రామంలో సిఐ వి శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ లు పల్లె నిద్ర చేశారు. గ్రామస్తులతో సమావేశమైన అధికారులు ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వినాయక చవితి నవరాత్రులు చేస్తున్న నిర్వాహ కులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా నూతన వ్యక్తులు వచ్చినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. అనంత రం స్థానిక ప్రాథమిక పాఠశాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సెయింట్ జాన్స్ స్కూల్లో.. మాతృభాషా దినోత్సవ వేడుకలు



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** తెలుగు భాష సాహితీ వేత గిడుగు రామ్మూర్తి జయంతి క్రీడాకారుడైన ధ్యాన్చంద్ గౌరవ సూచికంగా జరుపుకునే క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ అధినేత సాబుజాన్ విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గిడుగు తెలుగు భాషకు చేసిన సేవలను వివరించారు. గిడుగు పటానికి, ధ్యాన్చంద్ పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులు తెలుగు పాటలు శతక,పద్యాలు ఏకపాత్రాభినయాలు,శ్లోకాలు తెలుగు భాషను గురించి సందేశాలు ఇచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి కూడా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపాధ్యాయు లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపంలో పూజ



**కంచికచర్ల ఆగస్ట్ 29 మేజర్ న్యూస్ :** ఎస్ అమరవరం గ్రామంలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రులలో భా గంగా శుక్రవారం నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలసి పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు తేలప్రోలు రమణయ్య పాలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మారెడ్డి స్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** తెలుగు ప్రముఖ భాష వేత్త, రచయిత, వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్దులకు సూక్తులు, సామెతలు, పొడుపు కథలు, శతక పద్యాలు, వ్యాసరచన, తెలుగు సంవత్సరాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో గెలుపొందిన 150 మందికి డైరెక్టర్ కొమ్మారెడ్డి. కిషోర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ మాతృభాషను, మాతృభూమిని మరువకూడదని మాతృభాష పై పట్టు సాధిస్తే మిగిలిన భాషలను సులువుగా నేర్చుకోవచ్చని, ఈ రోజుల్లో మారుతున్న ప్రపంచంలో ఇంగ్లీష్, హిందీ మొదలైన అనేక ఇతర భాషలను నేర్చుకోవడం తప్పనిసరిగా మారిందని కాని మాతృభాషను మర్చిపోకూడదని తెలియజేశారు. శ్రీ కృష్ణదేవరాయలు దేశ భాష భాషలందు తెలుగు లెస్స అని కీర్తించారని, విదేశీయాత్రికులు తమ పురాతన గ్రంథాలలో తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని సంభోధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్సెక్రెటరీ-కరెస్పాండెంట్ కె.యస్.వి జి. శోభ యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి, హెచ్ఎం. ఎన్.శ్రీనివాసరావు ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ - ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం సూచించిన విప్ సౌమ్య



**నందిగామ, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** పట్టణం లోని కాకాని నగర్లోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజా దర్బారును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, నందిగామ మండల ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులూ పాల్గొన్నారు.ప్రజలు నేరుగా తమ వినతులు, సమస్యలు, అభ్యర్థనలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేకి తెలియజేసి పరిష్కారం కోరగా, వెంటనే స్పందించిన తంగిరాల సౌమ్య ప్రతి సమస్యను తక్షణమే నమోదు చేయించి, సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ప్రజల ఇబ్బందులను వాయిదా వేయకుండా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం లక్ష్యం ప్రజల వద్దకే పాలన చేరేలా చూడడమేనని, ఇకపై ప్రజలు ఎటువంటి సమస్యలతో ఇబ్బంది పడకుండా ప్రజా దర్బారుల ద్వారా పరిష్కారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అంచనాలను నెరవేర్చడంలో తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.ప్రజా దర్బారులో స్థానికులు తమ గృహ, విద్యుత్, రోడ్లు, పెన్షన్లు, వైద్య సేవలు వంటి వివిధ సమస్యలను వివరించారు. వాటిపై స్పందించిన అధికారులకు ఎమ్మెల్యే సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నందిగామ ప్రజలు తమ సమస్యలు నేరుగా వినిపించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడాన్ని హర్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పట్ల ఆందోళన వద్దు..



**పామర్రు మేజర్ న్యూస్ :** యూరియా పట్ల రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ సమృద్ధిగా అందుబాటులో ఉంచుతామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హామీ ఇచ్చారు. శుక్రవారం పామర్రులోని మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి పక్కన గల సంధ్య ఆక్వా పరిశ్రమ సందర్శన అనంతరం జిల్లా కలెక్టర్ ను కనుమూరు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు కలిసి యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేవని, సకాలంలో ఎరువులు అందించి ఆదుకోవాలని కోరారు. కనుమూరు సొసైటీకి వచ్చిన యూరియాను గ్రామంలోని రైతులకు కాకుండా బయట వ్యక్తులు తీసుకుపోతున్నారని, దీని వలన గ్రామంలోని రైతులు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ కు వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా పక్కదారి పట్టకుండా టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని, వారిచేత తనిఖీలు చేయించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొంత మంది రైతులు అవసరం మేరకు కాకుండా ఎక్కువ మొత్తంలో ముందుగానే నిల్వలు చేసుకుంటున్నారని, దీని వల్ల ఇతర రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది సరైనది కాదని హితవు పలికారు. గుజరాత్ రాష్ట్రం నుంచి సెప్టెంబర్ నెల 2వ తేదీ నాటికి యూరియా వస్తోందని, రైతులందరికీ సమృద్ధిగా అందుబాటులో ఉంచుతామని జిల్లా కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు పామర్రు మండల తహసిల్దార్ జి.రవికాంత్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎ.రాము, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు

**నందిగామ, ఆగస్టు 29, మేజర్ న్యూస్:** బాపట్ల న్యాయవాది టి. విజయ్ కుమార్ పై దాడి చేసి, అవమానకరముగా మాట్లాడిన బాపట్ల టౌన్ సిఐ,, ఎస్సై పై చట్టపరమైన తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణ కొరకు, అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్ చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు బహిష్కరించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థకు వారధిలా పనిచేసే న్యాయవాదులపై ఇటువంటి దాడులు జరగటం చాలా హేయమైన చర్య అని, ఎంతో పవిత్రమైన న్యాయవాది వృత్తి చేస్తున్న న్యాయవాదుల పట్ల పోలీసు వారు ఇంతటి అమానుషమైన చర్యలకు పాల్పడటం చాలా దారుణమని, న్యాయవాదులపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం గట్టి భద్రత కల్పించాలని, పోలీసులు న్యాయవాదులు ఒక కుటుంబ వ్యవస్థల కలిసిమెలిసి ఉండాలని ఉండాలని, ఎంతో గౌరవప్రదమైన న్యాయవాదుల వృత్తిని అవమానపరిచే విధంగా మాట్లాడి, న్యాయవాది పై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు న్యాయవాదులు కోరినారు. ఈ కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వరదబోయిన విజయకుమార్,



బార్ ట్రెజరర్ మాడుగుల స్టాలిన్ బాబు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ చావలి సాంబశివరావు, బార్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తాడేపల్లి కాంతారావు, వేల్పుల కిషోర్, గారెల్లి అరుణ్ కుమార్, కన్నెగంటి జీవరత్నం, బండి మల్లికార్జునరావు, మట్ట ప్రసాద్, యర్రంరెడ్డి బాబురావు, కన్నెగంటి జీవరత్నం, దాసరి వెంకట్రావు, చాపల శివరామకృష్ణ, పెసరమిల్లి సురేష్, జిల్లేపల్లి రంగారావు, బొబ్బిళ్ళపాటి భాస్కరరావు, కొమ్మినేని మొళేశ్వరరావు, యరగొర్ల రామారావు, కొనకంచి శ్రీనివాసరావు, బెజవాడ గోపి, నంద్రు గంగాధర్, గుడిసె సుమన్, వేల్పుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం కార్పొరేషన్‌కు హెల్త్ ఆఫీసర్‌ను నియమించకపోవడం దురదృష్టకరం

## ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం మచిలీపట్నం కార్పొరేషన్ కు ప్రత్యేక నిధులు కేటాయించండి...

### లంకిశెట్టి బాలాజీ డిమాండ్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నం అర్బన్, రూరల్ ప్రాంతాలలో ప్రతి ఇంటిలోనూ వైరల్ జ్వరాలతో, దగ్గు, జలుబులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని వారి ఆరోగ్య పరిరక్షణ కోసం మచిలీపట్నం కార్పొరేషన్ కు ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మచిలీపట్నం కార్పొరేషన్ కు హెల్త్ ఆఫీసర్ ను నియమించకపోవడం దురదృష్టకరమని అన్నారు. గతంలో వలే మచిలీపట్నంలో వీధులులలో బ్లీచింగ్, డ్రైనేజీల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్,వాటర్ ట్యాంకులలో నీటి పరిశుద్ధత కోసం చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో పారిశుద్ధ్య సమస్య వల్ల అనారోగ్యాలు రోగుల సంఖ్య పెరుగుతుందని బాలాజీ అన్నారు. ప్రజలను అప్రమత్తం చేసే విధంగా కరపత్రాలు ముదిరించి పంపిణీ చేయాలని బాలాజీ సూచించారు.మచిలీపట్నంలో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేటు ఆసుపత్రులు గాని రోగులతో కిటకిటలాడిపోతున్నాయని ప్రభుత్వాసుపత్రులను ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని బాలాజీ అన్నారు.వైరల్ ఫీవర్లు పేరుతో ల్యాబ్ టెస్టులు పేరుతో వేలాది రూపాయలు నగర ప్రజలపై భారం పడుతుందని బాలాజీ తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో తనిఖీలు ఏర్పాటు చేసి ఇంటింటికి మందులు పంపిణీ చేయాలని, ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని బాలాజీ కోరారు. ఏ విధమైన చర్యలు తీసుకోకపోతే హెల్త్ ఎమర్జెన్సీ పెట్టవలసిన రోజు దగ్గర్లోనే ఉంటుందని బాలాజీ తెలియజేశారు.

# తెలుగు వాడుక భాషోద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి..

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగు భాషను సరళీకృతం చేసి అభివృద్ధి చెందడానికి కృషి చేసిన మహనీయులు గిడుగు రామ్మూర్తి పంతులు గారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. తెలుగు వాడుక భాషోద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పూలమాల వేసి అంజలి ఘటించారు.అనంతరం కలెక్టరేట్లోని మీకోసం సమావేశం మందిరంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండితులకు మాత్రమే పరిమితమైన తెలుగు భాషను సరళతరం చేసిన మహనీయులు గిడుగు రామ్మూర్తి పంతులు అని ప్రశంసించారు.వాడుక భాష ఉద్యమంతో ప్రతి తెలుగు వాడికి తెలుగు భాషను అందుబాటులోకి తెచ్చిన పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులన్నారు. తెలుగు భాష అభివృద్ధి చెందడానికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. కృష్ణా జిల్లాలో గత సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాలనలో కూడా తెలుగు భాషను వాడాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.ఆ ప్రకారం జిల్లా యంత్రాంగంలో తెలుగు అమలులో నిదానంగా పురోగతి మొదలైందన్నారు. చాలా ప్రభుత్వ శాఖలు నోటు దస్త్రాలు అన్నీ కూడా తెలుగులోనే సమర్పిస్తున్నాయన్నారు. అలాగే రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖలు మరింత ఎక్కువగా పాలనలో తెలుగు అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఏవో రాధిక, పలువురు కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ కార్డులు ప్రభుత్వం అందిస్తున్నది

### మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వ్యవస్థలో పారదర్శకతను పెంచి,లబ్ధిదారులు సులభంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని కృష్ణా జిల్లా రైతు అధ్యక్షులు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం నూతనముగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు గురువారం స్థానిక పార్టీ నేతలతో మచిలీపట్నం రూరల్ మండలం కానూరు గ్రామంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ కార్డులు ప్రభుత్వం అందిస్తున్నది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర రావు, వీఆర్వో దాస్, పీత రాము, బోలిశెట్టి నాని, గోపు వెంకట రమణ, వంకా కాశీ, బోట్ల సాయి మోపిదేవి, బోట్ల వెంకటేశ్వరరావు, ఆముదలపల్లి వెంకటేశ్వరరావు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొక్కిలిగడ్డ కోదండరామయ్య మరణం బాధాకరం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్టణ తీర ప్రాంతం అభివృద్ధి సాధించాలని వారు నిత్యం తపించారు.పోర్టు సాధన ఉద్యమం లో గానీ, పులిగడ్డ - పెనుమూడి కోస్తా జతీయ రహదారి మచిలీపట్టణం మీదుగా మాత్రమే నిర్మిచాలని జరిగిన ఉద్యమములో గానీ ప్రధాన భూమిక పోషించడమే కాక మచిలీపట్టణం - రేపల్లె రైల్వే లైన్ సాధించాలని నిత్యం రైల్వే మినిస్టర్స్ కి లేఖలు రాస్తూ రైల్వే లైన్ ప్రాధాన్యతను గురించి ప్రజా ప్రతినిధులకు ప్రాతినిధ్యం చేస్తూ,పట్టువదలని విక్రమార్కుడి ల ఒంటరిగా లక్ష్యం వైపు ప్రయాణిస్తూ,కేంద్ర ప్రభుత్వం మచిలీపట్టణం - రేపల్లె రైల్వే లైన్ సర్వే కు నిధులు కేటాయించడానికి అయన వంతు చేసిన ప్రయత్నాన్ని విస్మరించలేం అని మంత్రి కొల్లు రవీంద్ర కోకిలగడ్డ కోదండ రామయ్య కొనియాడారు. గురువారం రాత్రి స్వర్గస్తులైన కొక్కిలిగడ్డ కోదండ రామయ్య భౌతిక కాయాన్ని పరామర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మెడికల్ డిపార్టుమెంటు లో చిరు ఉద్యోగాన్ని నిర్వహించి.. పదవి విరమణ అనంతరం.. వారికి వచ్చే పెన్షన్ ను ఈ ప్రాంత అభివృద్ధికి జరిగే ఉద్యమాలకు వెచ్చిస్తూ.. ఈ ప్రాంతం విజయవాడ కంటే ఎక్కువ అభివృద్ధి ని సంతరించుకున్న ప్రాంతంగ విరాజిల్లాలని నిత్యం తపించిన తపోధనులు కొక్కిలిగడ్డ కోదండరామయ్య స్వర్గ ప్రాప్తం చెందడం నిజంగా ఈ ప్రాంత అభివృద్ధికి తీరని లోటు అని వారికి శోకతప్త హృదయంతో మంత్రి నివాళులర్పించారు. అనంతరం మంత్రి, ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. కోదండ రామయ్య మరణ వార్త విని నగరంలోని పలువురు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. తండ్రిని కోల్పోయిన ఉపాధ్యాయులు కొక్కిలిగడ్డ పోతరాజు ధైర్యంగా ఉండాలని, భౌతికంగా ఆయన మనతో లేకపోయినా ఆయన జ్ఞాపకాలు నిరంతరం మనతోనే ఉంటాయని సానుభూతి తెలిపారు.



# పీ 4 పథకంలో ఉప సర్పంచ్ ముమ్మనేని నాని సాయం

### కుట్టుమిషన్, నగదు, సరుకులు వితరణ

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** పేదరిక నిర్మూలనలో భాగంగా ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా పీ-4 కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి ఉప సర్పంచ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని నాని పేదలకు సాయం అందించటం అభినందనీయమని మెప్మా పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయి బాబు అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్లోని ఎస్టీ ఏరియాలో పేదలకు నాని సహాయం చేశారు. భర్తను కోల్పోయి బడ్డీ కొట్టుపై జీవనం సాగిస్తున్న కళ్ళేపల్లి కోటేశ్వరికి 5వేల రూపాయలు, ఐదు వేల విలువైన సరుకులు అందించారు. పూరింటిలో నివసిస్తున్న కూతాడ పద్మకు కుట్టుమిషన్ ను అందించారు. ప్రత్యేకాధికారి సాయిబాబు, చల్లపల్లి ఎంపీడీఓ ఏ.వి.రమణ ల చేతులమీదుగా లబ్ధిదారులకు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్ వేముల హరికృష్ణ ఉన్నారు.

# మార్పుకు తొలి అడుగు పిల్లలతోనే మొదలవ్వాలి..




**గన్నవరం, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** వికేఆర్ కళాశాలలో శుక్రవారం మాతృ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. మాతృభాషను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. మార్పు మనం వేసే తొలి అడుగుతోనే ఉంటుందన్నారు. మన మాతృభాష అయిన తెలుగు చాలా గొప్పది అన్నారు. వేమన చెప్పిన ఆట వెలది పద్యాలు నేర్చుకోవాలన్నారు. రాత్రి కురిసిన వర్షానికి చంద్రుడు వెయ్యి ముక్కలయ్యాడని చెప్పారు. వేయి గుంటల్లో నిలిచిన నీటిలో చంద్రుడు కనిపించడమే దానికి అర్థం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాహిత్యం చదవాలన్నారు. తెలుగు అధ్యాపకులు కె. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు గొప్పదనాన్ని అర్థమయ్యేలా వివరించారు. ముందుగా తల్లిదండ్రులను, తర్వాత తెలుగు భాషను గౌరవించాలన్నారు. తెలుగు భాషలో పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్పందనలో మానసిక దివ్యాంగుల మధ్య జన్మదినోత్సవం



**గన్నవరం, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం దావాజిగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రంలో శుక్రవారం వీనస్ బుక్ సెంటర్, భగవతి ఎలక్ట్రికల్స్ అధినేత, సామాజిక సేవకుడు మోటమర్రి శేఖర్ జన్మదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ స్పందన లాంటి సేవా సంస్థలో దివ్యాంగ బాలల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం తనకు ఆత్మసంతృప్తి కలిగించిందని తెలిపారు. విద్య, వైద్యం, భోజనం, రవాణా వంటి సదుపాయాలను అందిస్తూ దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్న స్పందన సేవలు ప్రశంసనీయమన్నారు. సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ సేవలను ఆయన అభినందించారు. అనంతరం శేఖర్ ని స్పందన సిబ్బంది సన్మానించారు. బాలలకు భోజన విందు ఏర్పాటు చేసి, స్వీట్లు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళు పంపిణీ చేశారు. స్థానికులు, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

# మోపిదేవి మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఎం హరనాథ్

**మోపిదేవి మేజర్ న్యూస్ :** మచిలీపట్నం కలెక్టరేట్ నుండి మోపిదేవి మండల తహసీల్దారుగా నియమితులైన ఎం హరనాథ్ గురువారం సాయంత్రం బాధ్యతలను చేపట్టారు. మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన హరనాథ్ ను మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ హరనాథ్ స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఎవరైనా, ఎప్పుడైనా స్వయంగా కలిసి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని అన్నారు.

## అకాల వర్షాల వలన ఏర్పడిన పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

**కంచికచర్ల, ఆగస్టు 29, మేజర్ న్యూస్:** మండలంలోని చెవిటికల్లు గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వలన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. వాగు ఉధృతి కారణంగా గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా సమగ్రంగా చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో నీటి నిల్వల వలన జ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించకుండా తక్షణమే శుభ్రత చర్యలు చేపట్టాలని, గ్రామంలో ఆరోగ్య సిబ్బందిని మరింతగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత పట్ల ఎల్లప్పుడూ శ్రద్ధ చూపే విధంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య మరలా తన కర్తవ్య నిబద్ధతను చాటుకున్నారు. కార్యక్రమంలో కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమినేతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి రూ.8.29 కోట్లు మంజూరు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మైలవరం నియోజకవర్గ పరిధిలో సీఎం సహాయనిధి నుంచి 1069 మందికి రూ. 8.29 కోట్లు మంజూరు చేసినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తాజాగా 122 మందికి రూ. 79.14 లక్షలు సీఎంఆర్ఎఫ్ మంజూరు అయినట్లు పేర్కొన్నారు. గత వారంలో 200 మందికి రూ. 1.40 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 1400 మందికి సంబంధించిన దరఖాస్తులను సీఎం ఆర్ఎఫ్ కు సిఫారసు చేయగా 1069 మందికి సాయం అందినట్లు పేర్కొన్నారు. వీటిలో 900 మందికి శస్త్రచికిత్సలు, వైద్యసేవల అనంతరం సొమ్మును రీ ఎంబర్స్ మెంట్ చేయగా, మరో 169 మందికి ఎల్. ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) కింద సీఎం సహాయనిధి మంజూరు చేసినట్లు వెల్లడించారు. పేద వర్గాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి వరమన్నారు. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెడసనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి, గిడుగు వెంకట రామమూర్తి వేషధారణలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. అలాగే తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి సంజీవరావు సారథ్యంలో తెలుగు భాషా దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టిఖర్చులకు నగదు సాయం

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మండలం మేకావారిపాలెం సొసైటీ సభ్యులు, రైతు తోట కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా, కెడిసిసి బ్యాంకు సభ్యుల సంక్షేమ నిధి ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు ఛైర్పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ శుక్రవారం ఉదయం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, సీఈవో కోరుకొండ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ పెనుమూడి శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

## నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి రాజా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (1988-2020) ఆధ్వర్యంలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచీ వరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ నేతలు తెలిపారు. పూర్వవి ద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసి శిబిరం విజయవంతానికి కృషిచే యాలని విజ్ఞప్తి చేశారు. పూర్వవిద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు పుట్టినరోజు వేడుకలు జరుపనున్నట్లు తెలిపారు.

## వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వినాయకుని విగ్రహాలు నిమజ్జన చేసేందుకు ఎలాంటి ఆటంకాలు ప్రమాదాలు జరగకుండా అధికారు లు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పులిగడ్డ పెనుమూడి వారిధి పై వినాయకుని విగ్రహాల నిమజ్జనం చేసుకునేలా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు ఏర్పాటులు పూర్తి చేశారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భారీ గేట్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించారు. అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాజుల యువకుమార్. సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి బి అనిత టోల్గేట్ సిబ్బంది పులిగడ్డ పెనుమూడి బ్రిడ్జి వద్ద ఉన్నటువంటి ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు,

# మెగా డీఎస్సీతో యువత కలలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వం డిఎస్సి అంటూ యువతను మభ్యపెట్టగా, మెగా డీఎస్సీతో యువత కలలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ దస్త్రంపై తొలి సంతకం చేశారన్నారు. ఏడాదిలో నోటిఫికేషన్ నుంచి, ఉద్యోగాల భర్తీకి వరకు మొత్తం ప్రక్రియ పూర్తి చేశారు. యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. 2025 ఏప్రిల్ 20వ తేదీన ఒకేసారి 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, రికార్డు సమయంలో కేవలం నాలుగు నెలల్లో ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా భర్తీ ప్రక్రియను పూర్తి చేయడం మంత్రి లోకేష్ సమర్థతకు నిదర్శనమన్నారు. గత వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించి ఒక్క ఉపాధ్యాయుని కూడా నియామకం చేపట్టలేదన్నారు. 2019 ఎన్నికల ముందు మెగా డిఎస్సి అంటూ మాట ఇచ్చి, నాలుగున్నర ఏళ్ళు కాలయాపన చేసి 2024 ముందు మొక్కుబడిగా డిఎస్సి ప్రకటన ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టిందన్నారు. మళ్ళీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు వైసీపీ విమర్శలు చేస్తోందన్నారు. పేద విద్యార్థులు ఎక్కువగా చదువుకునే సర్కారీ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ లోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎటువంటి రాజకీయాలకు ప్రమేయం లేకుండా, విద్యావ్యవస్థపై రాజకీయాల ముద్ర పడకుండా మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలకు మంత్రి



లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ నడిచే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఇంత పారదర్శకంగా నడుస్తున్న కూటమి ప్రభుత్వంపై విపక్షం విమర్శలు చేయడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటకి కట్టుబడి పరిపాలన కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో పరిపాలన సవ్యంగా కొనసాగుతున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి బురద జల్లుతున్నాడని విమర్శించారు. ఎక్కడ ఏ వరద వచ్చినప్పటికీ రాష్ట్ర రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ తన సొంత మీడియాతో పాటు, సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. జె బ్రాండ్ మద్యంతో ప్రజల ప్రాణాలతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చెలగాటం ఆడిందన్నారు. ప్రజలు అన్ని విషయాలు గుర్తుంచుకుంటారని అన్నారు. యువతకు డిఎస్సీతో పాటు పరిశ్రమల ఏర్పాటు ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నో సవాళ్లు అధిగమిస్తూ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మంత్రి లోకేష్ కి ప్రజల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన మండల అధికారులు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో నిమజ్జన ప్రదేశాలను జిల్లా ఎస్ పి గంగాధరరావు, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఉత్తర్వుల మేరకు ఎమ్మార్వో బి.లోకరాజు, ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ గుడ్లవల్లేరు పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. గణేష్ నిమజ్జన సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా భారీకేడ్లు, లైటింగ్ సదుపాయ ఏర్పాట్లను పరిశీలించి, తగు జాగ్రత్తలు, సూచనలు తెలియ చేయడం జరిగింది. నిమజ్జన ఏర్పాట్లను గుడ్లవల్లేరు విఆర్వో శాయన ప్రకాష్, గుడ్లవల్లేరు పోలీసులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గుడ్లవల్లేరు మండల ప్రజలందరూ ముందుగా నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలని గుడ్లవల్లేరు పోలీసులు, ఎస్ఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేసారు.

## పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో సంవత్సరకాలం పూర్తి చేసుకున్న ఎస్ ఐ అర్జున్...

**పెనుగంచిప్రోలు, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించేందుకు విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అర్జున్ నేటితో సంవత్సరం పూర్తయినదని ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో ఆయనకు ఆయనే సాటి అనే పలువురు



అభినందనలుతెలిపారు. మండలంలోఎస్ ఐ అర్జున్ శాంతి భద్రతలను కాపాడుతూ, పౌరుల ఆస్తులను రక్షిస్తూ, నేరాలను నిరోధిస్తూ, వారి అధికార పరిధిలో చట్టాలు, నిబంధనలనుఅమలుచేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, వివాదాస్పద గుంపు నియంత్రణ, అత్యవసర ప్రతిస్పందన, ప్రథమ చికిత్స, పెట్రోలింగ్, అత్యవసర కాల్‌లు, సంఘటనలకు ప్రతిస్పందించడం, నేరాలను పరిశోధించడం, అనుమానితులను ఇంటర్వ్యూ చేయడం, సాక్ష్యాలను సేకరించడం, అరెస్టులు చేయడం, కోర్టులో సాక్ష్యమివ్వడం ఇలా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ నేటికీ సంవత్సరకాలం పూర్తి చేసుకున్నందున మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## పురిటిగడ్డ హైస్కూల్లో భాషాదినోత్సవ వేడుకలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ ప్లస్లో శుక్రవారం భాషాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, ఆంగ్ల పదం దొర్లకుండా తెలుగులో రెండు నిముషాలు మాట్లాడుట, తెలుగు ఛార్టులు రాయుట అంశాలపై తెలుగు ఉపాధ్యాయులైన డా. ఓలేటి ఉమాసరస్వతి, రాణిలు పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లను, బహుమతులను అందచేశారు. ఇన్చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొని తెలుగుభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** గణపతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రధాన సెంటర్లోని శ్రీలక్ష్మీగణపతి స్వామి దేవాలయం వద్ద గురువారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. చల్లపల్లి ఎన్టీఆర్ కళాపరిషత్ వారి సమర్పణలో నాటక



ప్రదర్శన జరిగింది. హరిశ్చంద్రుడుగా ప్రముఖ రంగస్థల కళాకారులు బోలెం రామారావు, దిరిశం శ్రీనివాస్, అప్పలస్వామి, చంద్రమతిగా లీలారాణి, విశ్వామిత్రుడు, కాలకౌశికుడు, వీరబాహునిగా వేపూరి వెంకట్రావ్, నక్షత్రకులుగా విన్నకోట మదుసూధనరావు, పోలినాయుడు, లోహితాసుడు బి.రాకేష్లు నటించారు. మేడా కృష్ణ బృందం ఆర్కెస్ట్రా సహకారం అందచేశారు. నాటక ప్రదర్శనకు ప్రేక్షకుల నుండి విశేష స్పందన లభించింది. నాటకం ప్రారంభం నుంచీ ముగిసే వరకూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేలా కళాకారులు అద్భుతంగా వారి వారి పాత్రల్లో లీనమయ్యారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## గణేష్ ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలి.

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గణేష్ ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి పండుగ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణపతి దేవుడు మీ జీవితాల్లోని అన్ని అడ్డంకులను తొలగించాలని, ఇంట్లో సుఖసంపదలు వెల్లివిరియాలని మనసారా కోరుకుంటున్నానని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గణపతి సేవాసమితి సభ్యులు, భక్తులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## లివర్ వ్యాధిగ్రస్తురాలికి సుఖీభవ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**పెడన మేజర్ న్యూస్:** లివర్ సంబంధిత వ్యాధితో గత ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతూ తన వైద్య ఖర్చులకు కూడా స్తోమత లేదని తెలుసుకుని సుఖీభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఛైర్మన్ అద్దంకి నాగ శంకర్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త పడమట సాగర్ సహకారంతో కొంత ఆగదును ఆర్థిక సహాయం కింద అందించామన్నారు. ఈ మేరకుగుడ్లవల్లేరు మండలం గాదెపూడి గ్రామస్తురాలు మా గుళ్ళు లక్ష్మి అనే లివర్ వ్యాధిగ్రస్తురాలకి ఆర్థిక సహాయం గా 5వేలు రూపాయలు నగదును అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ నాగ శంకర్ మాట్లాడుతూ సుఖీభవ ఫౌండేషన్ ఏర్పడినాటి నుండి అనేకమంది దాతల సహకారంతో ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పేదవారికి ఆకలి తీర్చే కార్యక్రమాలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యానికి స్తోమత లేని వారికి నగదు సహాయాలు ఇలా అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ ఫౌండేషన్ను పెడన ప్రెస్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలకు ఉన్నందువల్ల దినదిన ప్రవర్ధ మానంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు వ్యాపారవేత్త పడమట సాగర్ తదితరులు ఉన్నారు.

# హిమాలయ వెల్‌నెస్ 'వరల్డ్ ఆఫ్ నీమ్' ఆవిష్కరణ



**విజయవాడ, ఆగస్టు 29, మేజర్ న్యూస్ :** హిమాలయ వెల్‌నెస్ గత ఇరవై ఐదు ఏళ్లుగా నీమ్ శక్తితో మొటిమలు, మొటిమలతో పోరాడుతున్న యువ భారతీయులకు నమ్మకమైన తోడుగా ఉంది. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ చర్మ సంరక్షణపై అవగాహన కల్పించేందుకు మొదటిసారిగా 'ది వరల్డ్ ఆఫ్ నీమ్' ఈవెంట్‌ను తాజ్ లాండ్స్ ఎండ్‌లో నిర్వహించింది. భారతదేశంలో సుమారు ఇరవై కోట్ల యువత మొటిమలతో బాధపడుతున్నారు. ప్రతి ఐదుగురులో నలుగురు యువతీ యువకులు మొటిమల కారణంగా ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఈ సమస్యపై ఉన్న అపోహలను తొలగించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, మొటిమల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలపై అవగాహన కల్పించడం లక్ష్యం. ఈ కార్యక్రమం ఆధునిక యువత మనస్సులకు దగ్గర కావడానికి రూపకల్పన చేయబడింది. చర్మ సంరక్షణ ఎంత సులభం, సమర్థవంతం, సంపూర్ణమైనదో చూపించడమే కాకుండా మొటిమలు, మొటిమల సమస్యలపై ఉన్న దృక్పథాన్ని మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. చర్మ నిపుణులు, సినీ ప్రముఖులు, ఇన్ఫ్లుయెన్సర్లు, బ్రాండ్ ప్రతినిధులు కలసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు మొటిమలపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రయత్నం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొటిమలు, ఆత్మవిశ్వాసంపై ఇంటరాక్టివ్ ప్యానల్ చర్చ నిర్వహించారు. ఈ చర్చను ప్రముఖ డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్, వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి శెట్టి నడిపించారు. ఆమె సాధారణంగా ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ, సంపూర్ణమైన చర్మ సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. 'లపటా లేడీస్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన సెలబ్రిటీ నితాన్షి గోయల్ తన వ్యక్తిగత చర్మ అనుభవాలను పంచుకున్నారు. 'పింపుల్స్ అనేవి ఎదుగుదలలో భాగం మాత్రమే, దాచుకోవాల్సినవి కావు' అని చెప్పారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. వీరిద్దరూ కలిసి యువ ప్రేక్షకులను తమ చర్మాన్ని గర్వంగా, పాజిటివ్‌గా స్వీకరించేందుకు ప్రేరేపించారు. హిమాలయ తన ప్రసిద్ధ నీమ్ ఫేస్‌వాష్ ను కూడా ఈ వేడుకలో ప్రదర్శించింది. ఇప్పుడు ఇది ప్రత్యేకమైన 5 పార్ట్స్ ఆఫ్ నీమ్ ఫార్ములేషన్‌తో కలదు. ఇది మొటిమల సమస్యను మరింత సమర్థవంతంగా నియంత్రించనుంది. ఈ కొత్త ఆవిష్కరణతో హిమాలయ మొటిమల సమస్యకు సొల్యూషన్‌గా ప్రకృతిసిద్ధమైన మృదువైన సంరక్షణతో భారతదేశ నెంబర్ వన్ ఫేస్‌వాష్ బ్రాండ్‌గా ఎందుకు కొనసాగుతోందో మళ్లీ రుజువు చేసింది. ఈ సందర్భంలో హిమాలయ వెల్‌నెస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి, హిమాలయ వెల్‌నెస్ బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాగిణి హరిహరన్, హిమాలయ వెల్‌నెస్ ఫేస్ కేర్ కేటగిరీ జనరల్ మేనేజర్ అభిషేక్ అషాట్, బాలీవుడ్ స్టార్ నితాన్షి గోయల్ మాట్లాడుతూ పూర్తిగా లోపరహితంగా కనిపించాలనే ఒత్తిడి ఎక్కువగా ఉండే తరంలో నిజమైన చర్మమే అందమైనది అని మనం గుర్తుంచుకోవాలన్నారు. హిమాలయ 'వరల్డ్ ఆఫ్ నీమ్' మనందరికీ కావాల్సిన ఒక కీలక సందేశాన్ని ఇస్తుందన్నారు. తమ చర్మాన్ని దాచుకోవాల్సిన అవసరం లేకుండా, సిగ్గుపడకుండా సహజంగా, ఆత్మవిశ్వాసంతో జీవించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ చర్మ నిపుణురాలు, సెలబ్రిటీ డెర్మటాలజిస్ట్ డాక్టర్ రష్మి శెట్టి ప్యానల్‌లో రోజువారీ చర్మ సంరక్షణలో నీమ్ పాత్రను వివరించారు. మొటిమలు అత్యంత సాధారణమైన చర్మ సమస్యలలో ఒకటన్నారు. ఇది సహజమైనదే అయినా, దానిపై ఉన్న అపోహ, మనుషులపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుందన్నారు. నీమ్ శక్తివంతమైన యాంటీబాక్టీరియల్ లక్షణాలతో భారతదేశంలో విశ్వాసాన్ని పొందిందన్నారు. సరైన విధంగా ఉపయోగిస్తే ఇది చర్మంతో సమన్వయంగా పని చేసి, మృదువైన, సమర్థవంతమైన, సైన్స్ ఆధారిత సంరక్షణను అందిస్తుందన్నారు. ఇది కేవలం మొటిమలను నియంత్రించడమే కాకుండా, ప్రజలు తమ చర్మం గురించి గర్వపడేలా, ఆత్మవిశ్వాసం పొందేలా చేస్తుందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా హిమాలయ వెల్‌నెస్ చర్మ సంరక్షణపై ఉన్న దృక్పథాన్ని తొలగించేందుకు యువత ఆరోగ్యకరమైన, సంపూర్ణమైన చర్మ సంరక్షణ విధానాన్ని స్వీకరించేందుకు దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 'వరల్డ్ ఆఫ్ నీమ్' కేవలం ఒక ఈవెంట్ మాత్రమే కాదు, అది ఒక ఉద్యమం. పింపుల్ యాక్నే పాజిటివిటీ డే ద్వారా స్వీయ స్వీకారం, ఆత్మవిశ్వాసం, ప్రకృతి శక్తితో కూడిన సంరక్షణ అనే సందేశాన్ని వ్యాప్తి చేయడం దీని ఉద్దేశ్యం. ఈ సందర్భంలో హిమాలయ, దేశవ్యాప్తంగా ఐదు లక్షలకు పైగా విద్యార్థులను చేరుకునే పాఠశాల స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో విద్యార్థులకు పింపుల్ పాజిటివిటీ గురించి, పింపుల్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాల గురించి అవగాహన కల్పించనున్నారు.

## మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేటి యువత మానసిక గృహత్వానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని, క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని డి.ఎస్.పి తాళ్లూరి విద్యా శ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను ముందుగా జాతీయ జెండా క్రీడా పతాకం ఎగురవేసి డి.ఎస్.పి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు యువ నాయకుడు మండలి వెంకట్రాం మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి సంవత్సరం సమిష్టిగా ఆటల పోటీలు జాతీయ క్రీడల దినోత్సవం నిర్వ హించడం స్ఫూర్తి దాయకం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో ఉన్నతంగా సత్తా చాటితే స్పోర్ట్స్ కోట ఉద్యోగాలు వస్తాయి అన్నారు. అనం తరం కోడూరు మండలం వి కొత్తపాలెం జడ్పీ హైస్కూల్లో ఇటీవల నిర్వహిం చిన అవనిగడ్డ సబ్ జోన్ ఆటల పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. దాతలను, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరిం చారు. ఈ సందర్భంగా క్రీడా మైదానంలో భారీ జాతీయ జెండాను దేశభక్తి పాటల మధ్య ఉత్సాహంగా ఎగరవేశారు. డి.ఎస్.పి తాళ్లూరి విద్యా శ్రీ క్రీడా జ్యోతిని వెలిగించి మండలి వెంకట్రామ్ కు అందజేశారు. వందలాదిమంది విద్యార్థులు క్రీడాకారులు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎన్సిసి క్యాండిడేట్స్ వ్యాయామ ఉపాధ్యాయులు భారీ జాతీయ పతాకాలు క్రీడా పతాకాలతో అవనిగడ్డ పురవీధులలో క్రీడాజ్యోతి తో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి సాయిబాబు ఏఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు వైస్ చైర్మన్ రాజీనాల వీరబాబు ఎంపీడీవో వనజ కుమారి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పందుల సుజాత ఏపీ ఆర్ ఎస్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కెపిటి కుమార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబా బు. అవనిగడ్డ సబ్జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బి వెంక టేశ్వరరావు. ప్రధాన కార్యదర్శి బిపిఎల్ ప్రసాద్ ట్రెజరర్ తోట నవీన్ సంఘ సభ్యులు సిహెచ్ సుబ్బారావు గరికిపాటి మారుతి ఏపీ. ఎం శ్యామ్ కుమార్. కేకేఎం చందు. ఏశ్రీహరితో పాటు పెద్ద ఎత్తున విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

### తిరుపతి లడ్డు, ప్రసాదాల తయారీ విభాగంలో పనిచేస్తున్న

# బ్రాహ్మణులను వెంటనే పర్మెంట్ చేయాలి

**వారికి అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కలిపించాలి**

**సరైన చర్యలు చేపట్టకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం**

**హెచ్చరిక చేసిన ధార్మిక పరివార్ & బ్రాహ్మణ సంక్షేమ వేదిక**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం లోని లడ్డు, ప్రసాదాల తయారీ విభాగం లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న బ్రాహ్మణుల సమస్యలను పరిశీలించి, దశాబ్దాలుగా తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్న వారిని వెంటనే పర్మెంట్ చేయడమే కాకుండా వారికి అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కలిపించాలని డిమాండ్ చేస్తూ ధార్మిక పరివార్ & బ్రాహ్మణ సంక్షేమ వేదిక ల ఆధ్వర్యం లో ప్రత్యేక ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఈ ఆందోళనకు సంబంధించిన కార్యక్రమాలను నేటి ఉదయం విజయవాడలోని హోటల్ స్వర్ణ పాలెస్ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. విలేఖరుల సమావేశంలో ముందుగా వివి రామారావు, జాతీయ అధ్యక్షులు, ధార్మిక పరివార్ వారు మాట్లాడుతూ గత 25 సం.లుగా దేవుని కైంకర్యాలలో భాగమై ఎంతో కీలకమైన ప్రసాదాల తయారీలో భక్తి శ్రద్దలతో నిమగ్నమైన పోటు లోని లడ్డూ, ఇతరత్రా ప్రసాదాల తయారీ కార్మికులను దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 25 సం.లకు పైగా పని చేసిన వారెందరో ఉన్నా ఇంత వరకూ వీరిని రెగ్యులరైజ్ చేయకపోవడం వలన వారికి ఉద్యోగులకు సమానంగా అందాల్సిన ఇతర ప్రయోజనాలు అందడం లేదని వివరించారు. ఎవరికైనా ఆనారోగ్యం వస్తే పట్టించుకొలేనంత దారుణ స్థితిలో కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. అదే సందర్భంలో టిటిడి లోని పలు ఇతర కార్మికులను దేవస్థాన యాజమాన్యం పలు సందర్భాలలో రెగ్యులరైజ్ చేసిందని పేద బ్రాహ్మణుల విషయంలో మాత్రం చొరవ చూపకుండా చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో శ్రీవారి సన్నిధిలో ముఖ్యంగా అందరూ ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ తయారీ పని లో నిమగ్నమైన పేద బ్రాహ్మణ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చెయ్యాలని అలానే వారికి కూడా ఇతర టిటిడి ఉద్యోగస్థుల వలే ఆరోగ్య భీమా సదుపాయాన్ని వెంటనే కలిపించాలని డిమాండ్ చేశారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న ఈ కార్మికుల తరపున పోరాడాలని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ల తరపున నిర్ణయించామని ఇందులో భాగంగా భాగంగా టిటిడి పేద బ్రాహ్మణుల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ అమెరికా, కెనడా యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోని మా ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆద్వర్యంలో 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని ఆయా దేశాలలో సెప్టెంబర్ 6 వ తేదీ, విజయవాడలోని సత్యనారాయణ పురం సెప్టెంబర్ 14న నిర్వహించబోతున్నామని వెల్లడించారు.. రుద్రాభిషేక కార్యక్రమ అనంతరం కార్యక్రమంలో పాల్గొంటున్న బ్రాహ్మణులు ఈ సమస్యపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రితో పాటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని కలిసి విజ్ఞాన పత్రాన్ని అందజేసి సమస్యలను పరిష్కారించాలని కోరబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బాల శ్రీనివాస్, వ్యవస్థాపకులు, ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ వేదిక, ధార్మిక పరివార్ అనే సంస్థలు బ్రాహ్మణుల యొక్క సంక్షేమానికి, ప్రగతికి, అభివృద్ధికి, ఐక్యతను సాధించడానికి ఏర్పాటైనవని అన్నారు. వీటితో పాటూ సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులకు తోడ్పాటు అందించడానికి, రాజకీయంగా ఎదగడానికి సంస్థలు దోహదపడుతున్నామని, వివాహ పరిచయ సమాచారం, ఉద్యోగ సమాచారం అందచేయడానికి, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సులభంగా అందుకొనే విధంగా సహాయ సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం సహాయం అందించడంతో పాటూ బ్రాహ్మణులు వ్యాపార రంగంలో వృద్ధి చెందటానికి, అర్చకులు, పురోహితులతో పాటూ క్యాటరింగ్ రంగంలో పని చేస్తున్న బ్రాహ్మణులకు అవకాశాలు అందించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని వివరించారు. అలానే ఆరోగ్యపరమైన ఇబ్బందులతో భాద పడుతున్న వారికి రాయితీతో కూడిన మందులు, తక్కువ ఖర్చు తో హాస్పిటల్స్ లో అడ్మిట్ అయిన వారికి ట్రీట్మెంట్ ఇప్పించడం తో పాటూ ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేకంగా డయాగ్నస్టిక్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం చేస్తున్నామని దీంతో పాటూ బ్రాహ్మణ సాహిత్యాన్ని ప్రోత్సహించి తద్వారా హిందూ ధర్మ పరిరక్షణ కు కృషి కూడా చేస్తున్నాయని చెప్పారు. అలానే బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలు, వాటి పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తెచ్చే విధంగా బ్రాహ్మణ సంక్షేమ వేదిక తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని బాల శ్రీనివాస్ తెలిపారు. వాటిలో ముఖ్యంగా అర్చకత్వాన్ని కులవృత్తిగా ప్రకటించడం, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహకారం కోసం, బ్రాహ్మణ యువత, మహిళల కోసం స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించడం,బ్రాహ్మణులకు ఆరోగ్య సంరక్షణ బాధ్యత తోపాటు ఆరోగ్య బీమా కల్పిస్తూ,. తెల్ల రేషన్ కార్డు ను అందచేయడం, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్లను పునరుద్ధరించడం, వేద పాఠశాలల సంఖ్యను పెంచుతూ, వాటిని ఆర్థికంగా ఆదుకోవడం, బ్రాహ్మణులకు రాజకీయ ప్రోత్సాహం, వృద్ధ వేద పండితులకు, వృద్ధ మహిళలకు పెన్షన్ తోపాటు ప్రమాద భత్యం సహకారం, చిన్న దేవాలయాలలో ధూపద్రవ్య నైవేద్యాల కోసం ఆర్థిక సహకారం పెంచడం వంటి అనేక సమస్యలు ఉన్నాయని వివరించారు. ఈ కోవలోనే చేస్తూ బ్రాహ్మణ సంక్షేమ వేదిక, ధార్మిక పరివార్ లు ఈ వినూత్నమైన బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించే దిశగా తెలుగు రాష్ట్ర ప్రభత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని సెప్టెంబర్ 6వ తేదీన అమెరికా, అస్ట్రేలియా తదితర దేశాలలోనూ, విజయవాడలోని సత్యనారాయణ పురం సెప్టెంబర్ 14న ఒక వినూత్నమైన బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం. అనంతరం ప్రభుత్వంలోని పెద్దలను కలసి వీటిపై వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయం జరిగింది. అంతే గాకుండా బ్రాహ్మణ ఆర్థికాభివృద్ధి, సంక్షేమం,జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అతి త్వరలో అందచేయబోతున్నాము వీటిపై ప్రభుత్వ స్పందన ను బట్టి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం.



# శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవ వేడుకలు





కృష్ణలంక మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో 163వ జాతీయ వ్యవహారిక తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి, తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ "దేశ భాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవ రాయులు వారు అన్నారు. తెలుగు భాష మాధుర్యాన్ని మాటల్లో వర్ణించలేము. ఉగ్గు పాల నుండి ఒక బిడ్డకి తల్లి పాట పాడేందుకు వీలైన భాషలో స్పష్టత, నేర్పు, భావం, కూర్పు చాలా అందంగా ఉంటాయన్నారు. ఇంగ్లీషు భాష పట్ల పరిజ్ఞానం ఉండాలి కాని మాతృభాషను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మాతృభాషపై విద్యార్థులు చక్కటి అవగా హన కల్పించి, భాషను ప్రేమించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులున కృషి చేయాలన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచడం కోసం కృషి చేసిన ఎందరో గొప్పవకులు ఉన్నారని అన్నారు. వారిలో గిడుగు రామమూర్తి, ఒకరు.. గిడుగురామూర్తి 1863 ఆగష్టు 29వతేదీన జన్మించారు. ఆధునిక తెలుగు భాష నిర్మాతల్లో ముఖ్యుడు. తెలుగు సాహిత్యాన్ని సరళీకృత చేసి, తెలుగు తియ్యదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఎనలేని కృషి చేశారు. ఆయన కృషిని తెలియ జేస్తూ రామూర్తి పుట్టిన రోజును తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రామూర్తి వేషధారణ, తెలుగుతల్లి, వివిద కవుల వేషధారణలు ధరించి,పలు నృత్య' 'ప్రదర్శనలు' అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఈ.జి.యం.యం మురళి కృష్ణ, ఆర్.ఐ. జె.రాజేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ సి. హెచ్ సురేష్, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొన్ని విద్యార్థులకు తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేశారు.



## భారీ వర్షాల నేపథ్యంలో వీఎంసీ అధికారులు అప్రమత్తం

విజయవాడ మేజర్ న్యూస్ : భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడ నగరం ముంపునకు గురికాకుండా నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గం, 3వ డివిజన్‌లోని కీలకమైన పుల్లేటి కట్ట డ్రెయిన్‌పై దృష్టి సారించారు. దశాబ్దాలుగా ఆక్రమణలకు గురై, తన అసలు రూపాన్ని కోల్పోయిన ఈ డ్రెయిన్, వర్షపు నీరు సజావుగా ప్రవహించకుండా అడ్డుకుంటోంది. దీని ఫలితంగా డ్రెయిన్ పరిసర ప్రాంతాలైన లోతట్టు ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురై ప్రజలు అష్టకష్టాలుపడుతున్నారు. ఈ సమస్యపై తీవ్రంగా స్పందించిన వీఎంసీ కమిషనర్, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలను తొలగించి, డ్రెయిన్‌కు పూర్వవైభవం తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు వీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్ విభాగాల సమన్వయంతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో సిసిపి సంజయ్ కుమార్, ఏసిపి మోహన్ బాబు, టిపిఓ వసీం బేగ్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను, చెత్తాచెదారాన్ని యంత్రాల సహాయంతో తొలగించి, డ్రైన్ ప్రవాహానికి మార్గం సుగమం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా, ముంపు నివారణకు శాశ్వత పరిష్కారాలను అమలు చేస్తామని వీఎంసీ అధికారులు తెలిపారు. డ్రైన్ల ఆక్రమణలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నగర ప్రగతిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను

### పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు



విజయవాడ మేజర్ న్యూస్ : ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల సంఘం ద్వితీయ మహాసభ ఠాగూర్ స్మారక గ్రంథాలయం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ గురిందపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ పరిష్యాత్ అధ్యక్షులు గొనుగుంట్ల కోటేశ్వరరావు హాజరు అయ్యి ఆయన మాట్లాడుతూ శాఖా గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపుకు కొరకు కృషి చేస్తానని, జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించవలసిన సెస్ బకాయిలు నేరుగా సంస్థ జెడ్ జిఎస్ ఖాతాలలో జమ చేసేటట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి తీసుకొని వెళ్ళి పరిష్కారం చేస్తానని తెలియచేసారు. మరో విశిష్ట అతిథిగా సభకు విచ్చేసిన కామ్రేడ్ విద్యాసాగర్ ఏ.పి జేఏసీ చైర్మెన్ మాట్లాడుతూ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు కొరకు కృషి చేస్తామని తెలియచేసారు. ఉద్యోగుల పదోన్నతులు, పనివేళల మార్పు మీద సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని తెలియజేశారు. సమావేశం ముగింపు కార్యక్రమంలో పదవి విరమణ చేసిన తోకల రాంబాబుకి వచ్చిన అతిథుల చేతులమీదుగా ఆయనకు ఆత్మీయ సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు సభాధక్షులు గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ లైబ్రేరియన్ రమాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ,కోశాధికారి బి.గణేష్ బాబు, ఉపాధ్యక్షులు రంగారావు, సహాయ కార్యదర్శి, అలీ కృష్ణ జిల్లా అధ్యక్షులు కె.కృపానందం, కార్యదర్శి చిన్న రాజు, అన్ని జిల్లాల అధ్యక్షుల, కార్యదర్శులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

### తెలుగు భాష, సంస్కృతి పట్ల

## యువతకు అవగాహన అవసరం



విజయవాడ, మేజర్ న్యూస్ : తెలుగు భాష, సంస్కృతి పట్ల యువతకు అవగాహన అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ సత్యనారాయణపురంలోని శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఎల్.ఎస్.మూర్తి మాట్లాడుతూ, మన భాష, మన సంస్కృతి గురించి నేటి యువత తెలుసుకోవాలన్నారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని కొనియాడారు. పాఠశాల విద్యార్థులకు 'తెలుగు భాష –అమృత భాష' అనే అంశంపై పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి వేష ధారణలో పాఠశాల 8వ తరగతి విద్యార్థి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ బహుమతులను అందజేశారు.



## ఎస్సీ విద్యార్థులపై అనుచితంగా ప్రవర్తిస్తూ అవమాన పరిచిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

### జిల్లా ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రా సునీల్

మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఎస్సీ విద్యార్థుల పై అనుచితంగా ప్రవర్తిస్తూ అవమాన పరిచేలా మాట్లాడుతున్న కొంకేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని, భౌతికశాస్త్ర ఉపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలనీ కోరుతూ జిల్లా ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందచేశారు. మీరు గాలికి పుట్టారు అంటూ అవమానపరిచిన ఉపాధ్యాయురాలు ను, ఆమెకు వంతపాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు పై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రా సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. భవిష్యత్ లో ఇటువంటి ఘటనల పునరావృతం కాకుండా ఉండాలి అంటే చర్యలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేము కోటేశ్వరరావు, నాదెళ్ళ అరవింద్ కుమార్, పృధ్వీరాజ్, సాధన శివాజీ, పోతరాజు రవీంద్ర నీలా. పూర్ణ చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీలో క్రీడా వసతులకు చర్యలు

### కెయూ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ - క్రీడా దినోత్సవ వాక్ తాన్






మచిలీపట్నం మేజర్ న్యూస్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో క్రీడా వసతుల కల్పన కు ఖేలో ఇండియా పథకం కింద నలభై రెండు కోట్లతో ప్రతిపాదనలు ను కేంద్ర ప్రభుత్వం వద్దకు పంపడం జరిగిందని ఉప కులపతి ఆచార్య కె. రాంజీ వెల్లడించారు. జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భముగా శుక్రవారం మేజర్ ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ త్వరలో కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యములో అఖిల భారత విశ్వవిద్యాల యాల స్థాయిలో మహిళల నెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా తెలుగు భాషా వికాసం కోసం గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని శ్లాఘించారు. మాతృభాష ను నిర్లక్ష్యం చేయకుండా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు. వికసిత భారత్ 2047 – యువ కనెక్టింగ్ నోడల్ అధికారి డా ఎల్. సుశీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 18 సార్లు రాష్ట్ర హాకీ జట్టు సభ్యురాలిగా జాతీయ స్థాయిలో పాల్గొన్న జ్యోతిశ్రీ ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, విశ్వవిద్యాల య స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డా జె.నవీన లావణ్యలత, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి, ఆచార్య మారుతి, ఫిజికల్ డైరెక్టర్ గోపి పలువురు సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంత రం రెండు కిలోమీటర్లు వాక్ తాన్ నిర్వహించారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999